సాక్షి
ఆదిలాబాద్
శనివారం, 2, ఆగస్టు, 2025



డీఈవోలుగా ఐఏఎస్ అధికారులు

జిల్లా విద్యాశాఖకు తొలిసారిగా ఐఏఎస్ నియమితులయ్యారు. ఇన్‌చార్జి అధికారితో కొనసాగుతున్న డీఈవో పోస్టులో ఐటీడీఏ పీవోకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో▸



అధ్వానంగా అంతర్గత రోడ్లు

ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యవర్తిత్వంతో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు అన్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. 'మీడియేషన్ ఫర్ నేషన్' పేరుతో ప్రారంభించిన 90 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే నలుగురికి శిక్షణ కల్పించినట్లు తెలిపారు. మరో ఐదుగురికి సైతం శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జడ్జీలు పి.శివరాంప్రసాద్, రాజ్యలక్ష్మి, కుమారి లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, గంగారాం, న్యాయవాదులు పాల్గొన్నారు.

చాంపియన్లుగా నిలవాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయి వేదికలపై ఓవరాల్ చాంపియన్లుగా నిలవాలని డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐటీ స్టేడియంలో గల జూడో హాలులో శుక్రవారం నిర్వహించిన సబ్ జూనియర్, కేడేట్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. నిరంతరం సాధన చేస్తేనే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారినిఈనెల 5నుంచి 7 వరకు వరంగల్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూడో కోచ్ రాజు, డీఎస్‌ఏ సిబ్బంది సురేశ్, శిక్షకులు కబీర్‌దాస్, రమేశ్, శ్రీధర్ తదితరులున్నారు.

హాజరుశాతం పెంచాలి



అధ్యాపకులతో సమావేశమైన డీఐఈవో

ఇంద్రవెల్లి: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని లిమ్‌గూడలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

గుడిహత్నూర్: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మండలంలోని గురుజ గ్రామంలో గతంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుమ్ర గోవింద్ కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించి, నిజ నిర్ధారణ చేపట్టారు. గోవింద్ ఆత్మహత్యకు గల కారణాలు, సాగు చేసిన పంటలు, అప్పులు తదితర వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడారు. సాగులో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఆయన వెంట రైతులు అమృత్‌రావ్, తుకారాం, మారుతి తదితరులున్నారు.

రోడ్లపైకి పశువులను వదిలితే జరిమానా

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై పశువుల సంచారాన్ని కట్టడి చేసే దిశగా పంచాయతీ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి జి.రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. పశువులు మొదటిసారి రోడ్లపై సంచరిస్తే వాటిని బందెల దొడ్డికి తరలించి యజమానులకు రూ.500 చొప్పున జరిమానా విధించాలని పేర్కొన్నారు. పునరావృతమైతే రూ.వెయ్యి జరిమానా విధించాలన్నారు. అప్పటికీ మార్పు రాకుంటే క్రిమినల్ కేసు నమోదుతో పాటు వాటిని గోశాలలకు తరలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపైనా కూడా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

చెరువులు నిండలే!



తాంసి మండలంలోని సావర్గాం గ్రామ చెరువు ఇది. దీనికింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 70 శాతం మేర మాత్రమే నిండింది. వానాకాలంలో జలకళ సంతరించుకోవాల్సిన చెరువు ఈసారి ఆగస్టు వచ్చినా ఇంకా పూర్తిగా నిండకపోవడం గమనార్హం. యాసంగి సాగుతో పాటు భూగర్భజలాల వృద్ధిపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన స్థానికుల్లో కనిపిస్తుంది.



ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామ శివారులోని గురుదేవ్ చెరువు ఇది. ఈ వానాకాలంలో 80 శాతం వరకు నిండింది. అలుగు పారాల్సిన సమయంలో ఇంకా బోసిపోయి కనిపిస్తోంది. దీనికింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. యాసంగిలో ఆయా రైతులు ఈ చెరువును నమ్ముకొని పంటలు సాగు చేస్తారు.

- ప్రాజెక్టులదీ అదే పరిస్థితి
- జిల్లాలో నమోదుకాని భారీ వర్షాలు
- రైతుల్లో మొదలైన గుబులు
- వరుణుడి కరుణపైనే ఆశలు

జిల్లాలో చెరువుల పరిస్థితి..	
మొత్తం చెరువులు	283
75 శాతం నిండినవి	122
100 శాతం నిండినవి	161

ప్రాజెక్టుల వివరాలు..

ప్రాజెక్టు	నీటిమట్టం (మీటర్లలో) పూర్తిస్థాయి	నీటిమట్టం (మీటర్లలో) ప్రస్తుతం	నీటి సామర్థ్యం(టీఎంసీలలో) పూర్తిస్థాయి	నీటి సామర్థ్యం(టీఎంసీలలో) ప్రస్తుతం
సాత్నాల	286.50	285.65	1.046	0.870
మత్తడివాగు	277.50	277.15	0.470	0.425

సాక్షి,ఆదిలాబాద్: ఈ వానాకాలం మూడో నెలలోకి ప్రవేశించినప్పటికీ జిల్లాలో ఆశించిన స్థాయిలో భారీ వర్షాలు కురువకపోవడంతో జలాశయాలు ఇంకా పూర్తిస్థాయిలో నిండలేదు. ఈ పాటికి అలుగు పారాల్సిన సమయంలో వందలాది చెరువులు ఇంకా బోసిపోయి దర్శనమిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోనూ ఇదే పరిస్థితి. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కనిపించడం లేదు. ఈ వర్షాకాలంలో భిన్నంగా కనిపిస్తుండడంతో రైతుల్లో యాసంగి సాగుపై ఇప్పటినుంచే ఆందోళన వ్యక్తమవుతోంది. యాసంగిలో జొన్న, మొక్కజొన్న, శనగ, గోధుమ, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తుంటారు. వీటికి ప్రాజెక్టులు, చెరువుల కాలువల ద్వారా వచ్చే నీరే ప్రధానం. అయితే ఈ వానాకాలంలోనే ఇవి ఇంకా పూర్తిస్థాయిలో నిండకపోవడం గమనార్హం.

ఆయకట్టు రైతుల్లో బెంగ..

జిల్లాలో రెండు మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. సాత్నాల, మత్తడివాగుల్లో నీటి సామర్థ్యం ఇంకా పూర్తిస్థాయికి చేరుకోలేదు. సాత్నాల కింద 24వేల ఎకరాలు, మత్తడివాగు కింద 10వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే జిల్లాలోని చెరువుల కింద సుమారు 25వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో భారీ వర్షాలు కురిసి జలకళ సంతరించుకుంటేనే రానున్న యాసంగికి భరోసా ఉంటుంది. లేకుంటే రైతులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితి కొంత భిన్నంగా ఉండడం గమనార్హం.

కాలువల ద్వారా నీళ్లొచ్చే పరిస్థితి లేదు..



ఏమాయికుంట శివారు గురుదేవ్ చెరువు కింద హీరాపూర్‌లో నాకు నాలుగెకరాల సాగు భూమి ఉంది. యాసంగిలో పంటలు పండించాలంటే తప్పనిసరి ఆ చెరువు నీళ్లే దిక్కు. అయితే ఇప్పటివరకు నిండకపోవడంతో వచ్చే సాగు ఎలా చేపట్టాలో అర్థం కావట్లే. కాల్వల ద్వారా నీళ్లొచ్చే పరిస్థితి కనిపించట్లే.

– పఠాన్ అన్వర్, రైతు, హీరాపూర్, ఇంద్రవెల్లి మండలం

చాలా చెరువులు నిండలేదు..

జిల్లాలో ఇంకా అనేక చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. భారీ వర్షాలు కురిస్తే నిండే అవకాశం ఉంది. యాసంగిలో ఆయకట్టు భూములకు నీళ్లందించేలా చూస్తాం.

– విఠల్, ఈఈ, నీటిపారుదల శాఖ, ఆదిలాబాద్

అందరి కృషితోనే 'ఆస్పిరేషనల్' సక్సెస్



అధికారులు, సిబ్బందిని సత్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి తదితరులు

- కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్: అందరి కృషితోనే నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం విజయవంతంగా కొనసాగుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఖైర్‌డట్వా గ్రామంలో మొహువా లడ్డూ తయారీ యూనిట్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ప్రారంభించారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యాబోధనపై ఆరా తీశారు. భీంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. రాజులగూడలోని సుమన్‌బాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. నీతి ఆయోగ్ ప్రోగ్రాంకు సహకరిస్తున్న అధికారులు, సిబ్బందికి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద ఖైర్‌డట్వా గ్రామంలో మొహువా లడ్డూ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ తయారయ్యే లడ్డూలను కేజీబీవీలతోపాటు ప్రభుత్వ వసతి గృహాలు, మార్కెట్లకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ కింద చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు గాను జాతీయస్థాయిలో అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అలాగే రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. గాదిగూడలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి రాహుల్, జిల్లా రాయి సెంటర్ సార్‌మేడి మెస్రం దుర్గు, సీడీపీవో శారద, ఎంపీడీవో గంగాసింగ్, తహసీల్దార్ రాజలింగు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ రాజర్షిషాకు రాష్ట్రస్థాయి పురస్కారం

- నేడు గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం

కైలాస్‌నగర్: కలెక్టర్ రాజర్షి షా మరో రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉత్తమ సేవలందించిన జిల్లా కలెక్టర్లకు సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరోహ్ పేరిట పురస్కారాలను ప్రకటించింది. ఇందులో భాగంగా నార్నూర్ ఆస్పిరేషనల్ బ్లాక్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, ఆరోగ్యం వంటి ఆరు అంశాలను పక్కగా అమలు చేసినందుకు గాను కలెక్టర్‌ను గోల్డ్ మెడల్ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈమేరకు కలెక్టర్‌ను అవార్డుకు ఆహ్వానిస్తూ సెర్ప్ సీఈవో డి.దివ్యదేవరాజన్ నుంచి ఉత్తర్వులు అందాయి.

జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలి

- ఎంపీ గోడం నగేశ్



కేంద్రమంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని గుడిహత్నూర్ నుంచి మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లా అల్లాపల్లి వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా ఉన్నతీకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ గోడం నగేశ్ కోరారు. గురువారం రాత్రి మంత్రిని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ రహదారిని ఉన్నతీకరిస్తే గడ్చిరౌలిలో ఉన్న జాతీయరహదారి 353సీ తో అనుసంధానం అవుతుందని పేర్కొన్నారు. గుడిహత్నూర్ నుంచి ఇంద్రవెల్లి, ఉట్నూరు, జైనూరు, కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్నగర్, సిర్పూర్, కౌటాల, గూడెం మీదుగా అల్లాపల్లి వరకు గల ఈ మార్గంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే పార్లమెంట్ పరిధిలో ఉన్న పలు రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

జేఎన్‌వీ మంజూరు చేయాలి

ఆదిలాబాద్: జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయాలని ఎంపీ గోడం నగేశ్ కోరారు. శుక్రవారం పార్లమెంట్‌లో రూల్ 377 కింద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంలో ఇబ్బందులు తప్పడం లేదని, అలాగే జాతీయ అక్షరాస్యతతో పోల్చితే జిల్లా అక్షరాస్యత రేటు చాలా తక్కువగా ఉందన్నారు. వీటికి పరిష్కార మార్గంగా జవహన్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ) ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం యశ్వంత్‌గూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి బోయర్ జగదీశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పంచాయతీ కార్యదర్శుల పనితీరు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ అమలు చేస్తోంది. ప్రత్యేక యాప్‌లో వారు హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే సదరు కార్యదర్శి ఫేక్ అటెండెన్స్ నమోదు చేశాడు.ఈమేరకు పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధికల్పనశాఖ కమిషనర్ కార్యాలయంలో గుర్తించి జిల్లా అధికారులను వివరాలు కోరారు. ఈ మేరకు అటెండెన్స్ ఫేక్ అని తేలడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆదిలాబాద్ మండల పంచాయతీ అధికారి స్వప్నశీలకు షోకాజ్ జారీ చేశారు. కాగా జిల్లాలోని మరికొంత మంది పంచాయతీ కార్యదర్శులపై విచారణ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



రేషన్‌కార్డు మంజూరుపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే బొజ్జు, పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలకేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాతో కలిసి కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు శుక్రవా రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎలాంటి పైరవీ లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీజేపీ మత రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎస్‌వో వాజిద్ అలీ, ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ నాయకులు ఎండీ మసూద్, ఎండీ జహీర్ తదితరులున్నారు.

బాలలు బడిలోనే ఉండాలి

- ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం
- 93 మంది బాలకార్మికులకు విముక్తి.. 28 కేసులు నమోదు
- ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: బాలలు బడిలోనే ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్ ముస్కాన్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో 93 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామని, 28 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 86 మంది బాలురు, ఏడుగురు బాలికలను రక్షించినట్లు తెలిపారు. 70 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. అలాగే 23 మంది పిల్లలను వసతిగృహాలకు తరలించి వారి బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్మిక, విద్యాశాఖలతో పాటు చైల్డ్ ప్రొటెక్షన్, ఎన్జీఓల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ నెలపాటు కాకుండా నిరంతరం సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు ఉన్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సమష్టి కృషితోనే బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చన్నారు.

పోలీసు ఆధీనంలో ఉన్న వాహనాలను తీసుకెళ్లాలి

పోలీసు ఆధీనంలో ఉన్న వాహనాలను వాహనదారులు నిజధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఆరు నెలల్లోగా తీసుకెళ్లాలని ఎస్పీ అన్నారు. జిల్లాలోని ఆయా స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు సంబంధించి, పలుచోట్ల లభ్యమైన వాహనాలు 51 ఉన్నాయని తెలిపారు. 2026 జనవరి వరకు అవకాశం ఉందని, యజమానులు గమనించాలని సూచించారు. గడువు అనంతరం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో మిగిలిన వాటికి బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. సందేహాలు ఉంటే రిజర్వు ఇన్‌స్పెక్టర్ మురళిని 8712659962 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

టీచర్ల ఫేషియల్ అటెండెన్స్ షురూ

- తొలిరోజు 61శాతం హాజరు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం మొదటి రోజు జిల్లాలో 61.53 శాతం హాజరు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 691 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3,288 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే ఫేషియల్ అటెండెన్స్ యాప్‌ను 2,023 మంది ఇన్‌స్టాల్ చేసుకొని హాజరు వేసుకున్నారు. టీచర్ల సమయపాలన కోసం ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఉదయం 9.05 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే తొలిరోజు ఫొటో అప్‌లోడ్ కావడానికి కొంత ఆలస్యమైందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకేసారి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల ఫేషియల్ లాగిన్ అవ్వతుందని తెలిపారు.

ఖాళీ ప్లాట్లపై బల్దియా దృష్టి



జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీలో గల ఓ ఖాళీ ప్లాట్‌లో నిలిచిన నీరు

- శుభ్రత పాటించని వారికి హెచ్చరిక
- స్పందించకుంటే చర్యలకు సిద్ధం

కైలాస్‌నగర్: పిచ్చిమొక్కలు, మురుగునీటి నిల్వతో అపరిశుభ్రత నెలకొని సీజనల్ వ్యాధుల ప్రబలతకు కారణమవుతున్న పట్టణంలోని ఓపెన్‌ప్లాట్లపై బల్దియా దృష్టి సారించింది. ఆయా కాలనీల్లో గల ఖాళీ ప్లాట్లను ఇప్పటికే గుర్తించిన అధికారులు వాటిలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. యజమానులు స్పందించకుంటే 2019 మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలకు సిద్ధమవుతున్నారు.

ఇదీ పరిస్థితి...

ఆదిలాబాద్ పట్టణంలో మొత్తం 49 వార్డులున్నాయి. వీటి పరిధిలో వందలాది ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచడం, నిర్వహణ లేకపోవడంతో అందులో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. దీనికి తోడు చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వేస్తున్నారు. దీంతో అపరిశుభ్రత నెలకొంటుంది. మరికొన్ని ప్లాట్లలో మురుగునీరు ప్రవహించే అవకాశం లేకపోగా అక్కడే నిల్వ ఉంటుంది. కొన్ని చోట్ల వర్షపునీరు బయటకు వెళ్ల లేక చిన్నపాటి కుంటలుగా మారుతున్నాయి. అందులో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధుల ప్రబలతకు కారణమవుతున్నాయి. వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఈ పరిస్థితిని అధిగమించేలా బల్దియా అధికారులు చర్యలు చేపట్టారు.

మూడు రోజుల్లోగా స్పందించాలి

అపరిశుభ్రంగా ఉండే ఖాళీ ప్లాట్లతో చుట్టుపక్కల ఉండే వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవి కారణమవుతున్నాయి. ఖాళీ ప్లాటును శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత యజమానిదే. దాన్ని గుర్తు చేసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నాం. మూడు రోజుల్లోగా స్పందించాలి. లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– బైరి శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ప్రతీ ప్లాట్‌లో హెచ్చరిక బోర్డు..



హెచ్చరిక బోర్డులోని సందేశం

ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరగకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ప్లాట్ల యజమానులదేనని స్పష్టం చేస్తూ బల్దియా అధికారులు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయించారు. శుభ్రత పాటించని పక్షంలో మున్సిపల్ యాక్ట్–2019 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు అందులో స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన ఖాళీ ప్లాట్లన్నింటిలో వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. బల్దియా అధికారుల ఆలోచన స్వాగతించదగినదే అయినప్పటికీ ఎంత మంది స్పందిస్తారనేది వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్ టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ రేపాల కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశానికి సెప్టెంబర్ 23లోపు https://cbseitms.nic.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

బెజ్జూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బోధించేందుకు ఒప్పంద ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి అరుణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్ బోధించేందుకు ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ టెట్ అర్హత గల వారు, నర్సింగ్ బోధించేందుకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 5న సాయంత్రం 5గంటలలోపు బెజ్జూర్ కేజీబీవీలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో డీవైఎస్వో శ్రీనివాస్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు హన్మకొండ వేదికగా ఈనెల 3 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో పీ స్వాతి (60 మీటర్స్ రన్నింగ్), పీ కావ్య (60 మీటర్స్), ఎం.శివాని (600 మీటర్స్), పీ రితిక(ట్రయాత్లాన్), వీ మహేశ్ (జావెలిన్ త్రో), డీ యువరాజ్ (80 హర్డిల్స్) ఎస్.చరణ్ (ట్రయాత్లాన్-ఏ), ఎం.హన్మంతు (ట్రయాత్లాన్-బీ) ఉన్నారు. వీరిని డీవైఎస్వో జక్కుల శ్రీనివాస్ శుక్రవారం అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సురేశ్, అథ్లెటిక్స్ కోచ్ రమేశ్ ఉన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జైలు



నిందితుడు ఆనంద్‌తో ఎక్సైజ్ అధికారులు

కడెం: బైండోవర్ ఉల్లంఘించిన మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బానవత్ ఆనంద్‌ను జైలుకు పంపినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. తహసీల్దార్ ప్రభాకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆదిలాబాద్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు. ఆనంద్ గతంలో పలుసార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్షతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది వెంకటేశ్, జాయి, రాజేందర్, రవీందర్ తదితరులున్నారు.

బురదలో చిక్కి ఎద్దు మృతి



బురదలో చిక్కుకుని మృతిచెందిన ఎద్దు

నేరడిగొండ: బురద దారిలో చిక్కుకుని ఎద్దు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సూది రమేశ్ ఎడ్లబండితో పొలానికి వెళ్తుండగా మార్గమధ్యలో రోడ్డు పూర్తిగా బురదతో నిండి ఉండగా అందులో ఎడ్లబండి దిగబడింది. ఈ క్రమంలో ఎద్దు బురదలో చిక్కుకుని అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. పరిహారం అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

క్రిమిసంహారక గడ్డి తిని మూడు గేదెలు మృతి



గేదెకు చికిత్స చేస్తున్న వెటర్నరీ సిబ్బంది

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో క్రిమిసంహారక మందులు స్ప్రే చేసిన గడ్డి తిని మూడు గేదెలు మృతి చెందినట్లు మండల పశువైద్యాధికారి సౌందర్య తెలిపారు. మరో మూడు గేదెలకు చికిత్స చేస్తున్నామని, వాటి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మరణించిన గేదెల శాంపిళ్లు సేకరించి ఆదిలాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. వెటర్నరీ సిబ్బంది రాజేశ్వర్, నారాయణ ఉన్నారు.

డీఈవోలుగా ఐఏఎస్ అధికారులు

- ఆదిలాబాద్‌కు ఐటీడీఏ పీవో
- ఆసిఫాబాద్‌కు అడిషనల్ కలెక్టర్
- అక్రమార్కుల్లో మొదలైన గుబులు
- విద్యావ్యవస్థ గాడిలో పడేనా?



ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం



ఖుష్బూగుప్తా, ఎఫ్ఏసీ డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖకు తొలిసారిగా ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఇన్‌చార్జి అధికారితో కొనసాగుతున్న డీఈవో పోస్టులో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆమె ఇప్పటికే ఐటీడీఏ పీవోతో పాటు స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా, ఆదిలాబాద్ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐఏఎస్ అధికారికి జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుష్బూ గుప్తాకు విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరుండడంతో అక్రమార్కులు, డుమ్మా టీచర్లలో గుబులు మొదలైంది. 2018నుంచి రెగ్యులర్ అధికారి లేక విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అప్పటి నుంచి ఇన్‌చార్జి అధికారులతోనే కాలం నెట్టుకువస్తున్నారు. ఇన్‌చార్జి అధికారులకు శాఖపై పట్టులేకపోవడంతో పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఏడేళ్లుగా ఇన్‌చార్జీలే..

2018 నుంచి జిల్లాలో ఇన్‌చార్జి అధికారులతోనే విద్యావ్యవస్థ కొనసాగుతోంది. అప్పట్లో పనిచేసిన జనార్దన్‌రావును కార్యాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘ నాయకులతో ఉన్న గొడవల కారణంగా అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న రవీందర్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మూడేళ్ల పాటు పనిచేసిన అతడిని నిర్మల్ జిల్లాకు బదిలీ చేయడంతో అక్కడ ఏడీగా పనిచేస్తున్న ప్రణీతను జిల్లా విద్యాధికారిగా నియమించారు. ఇటీవల ఆమె ఉద్యోగ విరమణ పొందడంతో మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన విధుల్లో చేరలేదు. దీంతో జిల్లా వయోజన విద్యాశాఖ డీడీగా ఉన్న శ్రీనివాస రెడ్డికి కలెక్టర్ రాజర్షి షా ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఆయన నాలుగు నెలల పాటు ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం అతడిని తప్పిస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాకు బాధ్యతలు అప్పగించారు. అయితే కీలకమైన ఐటీడీఏ పీవో పోస్టుతో పాటు స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఇప్పటికే మూడు ప్రధాన పోస్టుల్లో కొనసాగుతుండగా ఆమెకే జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు అప్పగించడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, శనివారం నుంచి జిల్లాలో ఉపాధ్యాయ ప్రమోషన్ల ప్రక్రియ జరగనుంది. ఈ ప్రక్రియ సాఫీగా నిర్వహించడంతో పాటు విద్యాశాఖను ఏ విధంగా గాడిన పెడతారనేది ఆసక్తిగా మారింది. ఏదేమైనా ఐఏఎస్ అధికారిని డీఈవోగా నియమించడంతో విద్యాశాఖలో అక్రమాలకు చెక్ పడనున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

ఆసిఫాబాద్‌కు అడిషనల్ కలెక్టర్ తివారీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా విద్యాశాఖలో ఏడాదిగా ఇన్‌చార్జి డీఈవో పాలన కొనసాగుతోంది. మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య ఇన్‌చార్జి డీఈవో కొనసాగతుండగా శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి అదనంగా డీఈవో బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీవోఈ తరలింపుపై ప్రభుత్వానికి నివేదిస్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



పీవోకు వినతిపత్రం ఇస్తున్న కొలాం సేవా సంఘం ప్రతినిధులు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని హయత్‌నగర్ లోగల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)ని నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటకు తరలించడంపై ప్రజల ఆక్షేపణను ప్రభుత్వానికి నివేదిస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. సీవోఈని హయత్‌నగర్ నుంచి తరలించవద్దని శుక్రవారం ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ప్రతినిధులు పీవోకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. 200 మంది ఆదివాసీ విద్యార్థులు సీవోఈలో ఇంటర్ చదువుతున్నారని తెలిపారు. సీవోఈని అచ్చంపేటకు తరలిస్తే మరో 150 కిలోమీటర్ల దూరభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తంజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ప్రతినిధులు అందించిన వినతిపత్రంపై గిరిజన సంక్షేమ కమిషనర్‌తో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. సంఘం ప్రతినిధులు కొడప సోనేరావు, మాడవి గోవిందరావు, టేకం లక్ష్మణ్, సిడాం అన్నిగా, మడవి నాగరావు, మడవి కిషన్, టేకం భీమ్ రావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు దివ్యాంగులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రతీ దివ్యాంగుడికి 35 కిలోల బియ్యం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. 165 రోజులు పని కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు, 100శాతం సబ్సిడీ రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. నాగేశ్, గేడం జమున, జగతిరావు, బుచ్చన్న, సరోజ, ప్రియాంక తదితరులున్నారు.

రౌడీయిజానికి పాల్పడిన వ్యక్తిపై పీడీయాక్ట్

ఆదిలాబాద్‌టౌన్: రౌడీయిజానికి పాల్పడుతున్న వ్యక్తిపై పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన షేక్ సలీమ్ అలియాస్ కైచి సలీమ్ హత్య, రౌడీయిజం, కిడ్నాప్, బెదిరింపుల కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. షేక్ సలీమ్ పబ్లిక్ స్థలాల్లో మారణాయుధాలతో విన్యాసాలు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పెడుతున్నాడని, రౌడీయిజం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో పలు పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో హత్య కేసు, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసులున్నట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి రూమ్‌లో బంధించి విచక్షణారహితంగా దాడి చేసి వీడియో తీశాడని తెలిపారు. షేక్ సలీమ్‌పై 2019లో హత్య కేసు, ఈ ఏడాది రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆమ్స్ యాక్ట్, రౌడీయిజం కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రవర్తన మార్చుకోని రౌడీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రగతికాలనీలో కొండ చిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న యువకులు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని బీ జోన్ ప్రగతికాలనీలో కొండ చిలువ కలకలం రేపింది. కాలనీలోని ఓ ఇంటి వద్ద శుక్రవారం కొండ చిలువను గమనించిన స్థానికులు పాములు పట్టే వారికి సమాచారం అందించారు. వారు వచ్చి కొండచిలువను పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. కాలనీ సమీపంలో చుట్టూ ఏపుగా చెట్లపొదలు ఉంటున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదని కాలనీవాసులు వాపోయారు. దీంతో పాములు, విషకీటకాలు ఇండ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

హరితం.. వ్యర్థం!





పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం అభాసుపాలవుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. మొక్కల సంరక్షణకు ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో పశువులు తొక్కి విరిచేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





దేగాంలో చోరీ

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన కరేవాడ్ మైసాజీ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరేవాడ్ మైసాజీ గురువారం రాత్రి తన కుటుంబీకులతో భోజనం చేసి ఓ గదిలో నిద్రించారు. అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని దుండగులు కుటుంబీకులు నిద్రించిన గదికి బయట నుంచి గొలుసు పెట్టారు. శుక్రవారం ఉదయం నిద్ర లేవగా బయటి నుంచి గొలుసు పెట్టి ఉండడంతో పక్కింటి వారికి ఫోన్ చేయగా వారు వచ్చి తలుపులు తెరిచారు. దీంతో బయటకు వచ్చిన వారు మరో గదిలో చూడగా బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగిందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. బీరువాలో దాచిన రెండు తులాల బంగారం, 24తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.5వేల నగదు పోయినట్లు బాధితులు తెలిపారు. కరేవాడ్ మైసాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

బెల్లంపల్లి: చెక్ బౌన్స్‌కేసులో బెల్లంపల్లికి చెందిన ఒకరికి జైలు శిక్ష పడింది. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ భూడిదగడ్డ బస్తీకి చెందిన మిట్టపల్లి సతీశ్‌కు అదే బస్తీలో నివాసముంటున్న ఓదురుకోట పూర్ణచందర్ రూ.15లక్షల చెక్కు ఇచ్చాడు. సతీశ్ ఆ చెక్కును బ్యాంక్‌లో అప్పగించగా ఖాతాలో డబ్బులు లేక బౌన్స్ అయింది. ఈమేరకు పూర్ణచందర్‌పై సతీశ్ కోర్టుకు వెళ్లాడు. నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జే ముఖేశ్ పూర్ణచందర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.20 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్ర వాసి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని మాహోర్ తాలుకా వనోర్‌కు చెందిన రాథోడ్ శివాజీ (19) రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ శివాజీ పత్తి పంటకు పురుగులమందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మందు అతడి నోట్లోకి వెళ్లింది. దీంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ వివరించారు.

రైతు సంక్షేమంపై ప్రభుత్వాలు స్పందించాలి



రైతు కుటుంబానికి రూ.10 వేలు ఇస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రకుమార్

దిలావర్‌పూర్: రైతు సంక్షేమంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆత్మహత్యలు ఆపాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని మాయాపూర్ గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డ కామిండ్ల భీమన్న కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు ప్రభుత్వాలు ముందే మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులనూ ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఇప్పటివరకు ఇస్తున్న రైతు బీమా పరిహారాన్ని రెట్టింపు చేయాలని కోరారు. వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు, కౌలు రైతులకు, రైతు కూలీలకు 60 ఏళ్లు దాటితే వారికి నెలకు రూ.5వేల పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు రూ.10లక్షలు అందజేసి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతు సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ, కోశాధికారి సూర్యకిరణ్, స్థానిక పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సింగరేణి లాభాలు ప్రకటించాలి



సీహెచ్‌పీ ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన: గత ఆర్థిక సంవత్సరం సింగరేణి ఆర్జించిన లాభాలను వెంటనే ప్రకటించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. శుక్రవారం గోలేటి సీహెచ్‌పీలో ఎస్ఈ కోటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ లాభాలను ప్రకటించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటూ దేశానికి వెలుగులు ప్రసాదిస్తున్న సింగరేణి కార్మికులు గత సంవత్సరం సంస్థ ఆర్జించిన లాభాలు తెలియక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ చేతకాని తనం తోనే లాభాల ప్రకటనలో జాప్యం ఏర్పడుతోందని విమర్శించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చేస్తామని ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ హామీ ఇచ్చిందని, గుర్తింపు సంఘంగా గెలిచి 18 నెలలు పూర్తవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకత్వం పోరాటాలను మరిచి కార్మిక హక్కులను యాజమాన్యానికి తాకట్టుపెట్టి కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. సింగరేణి యాజమాన్యం వెంటనే లాభాలు ప్రకటించి కాంట్రాక్టు కార్మికులకూ లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. పిట్ కార్యదర్శి ఎండీ ఆరీఫ్, ఏరియా ఆర్గనైజర్ మారిశెట్టి దత్తు, కాంట్రాక్ట్ వర్కర్స్ పిట్ కార్యదర్శి బాలేశ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి దీపక్‌రాజ్, ఆర్గనైజర్ రాజేశ్, కార్మికులు శోభన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిపై వర్షాల ప్రభావం



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: గత జూలైలో వర్షాలతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడిందని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. జూలైలో 370 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షాలతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని పేర్కొన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 4.89 లక్షల టన్నులకు 4.30 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 21.49 లక్షల టన్నులకు 19.85 లక్షల టన్నులు సాధించి 92 శాతం లక్ష్యాన్ని నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వర్షాలతో ఓసీపీల్లో స్టాక్ కోల్ లిఫ్ట్ చేసినట్లు తెలిపారు. భూగర్భగనుల్లో ఆర్కే 5, ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ 1, ఓసీపీల్లో ఐకే ఓసీపీ 135 శాతం ఉత్పత్తిని నమోదు చేసుకున్నట్లు వివరించారు. డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జైపూర్: గత నెల 28న లక్సెట్టిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో భీమారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు మనోజ్, సీహెచ్ జానులు 600 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పరీక్షలో ఫెయిలై విద్యార్థి ఆత్మహత్య



రిత్విక్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పరీక్షల్లో ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన జిల్లా కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్న భూమన్న–గీత దంపతులకు కూతురు, కుమారుడు రిత్విక్ (17) ఉన్నారు. రిత్విక్ జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నెల క్రితం ప్రథమ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, ఆరు సబ్జెక్టులకు ఐదింటిలో ఫెయిలయ్యాడు. దీంతో కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురవుతున్నాడు. రెండు రోజుల నుంచి కళాశాలకూ రాలేదని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. కూతురు లక్సెట్టిపేటలోని వసతిగృహంలో ఉంటూ చదువుకుంటోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రిత్విక్ చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికొచ్చిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు రోధించిన తీరు అందరినీ కలచివేసింది. విషయం తెలుసుకున్న స్నేహితులు అక్కడికి చేరుకున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువతి..

నెన్నెల: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగాల్‌పేట పంచాయతీ పరిధి ఖర్జి గ్రామానికి చెందిన గిరిజన యువతి అద్దెరపల్లి మమత(19) పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఉపాధి కోసం ఏడాది క్రితం రూ.1.60 లక్షలతో బెల్లంపల్లిలో సెకండ్ హ్యాండ్ ఆటో కొనుగోలు చేసింది. డ్రైవర్‌తో దానిని నడిపించుకుంటూ అమ్మానాన్నలకు ఆసరాగా ఉంటోంది. అయితే.. అప్పటికే సదరు ఆటోపై ఫైనాన్స్ ఉందన్న విషయం తెలియక మోసపోయింది. ఆటోను అమ్మిన వ్యక్తి కిస్తీలు కట్టకపోవడంతో నెల కిందట మమత వద్ద ఉన్న ఆటోను ఫైనాన్స్ వారు సీజ్ చేసి తీసుకెళ్లారు. దీంతో ఉపాధి కోల్పోయి, ఆర్థికంగా నష్టం జరగడంతో నిత్యం బాధపడుతోంది. ఈక్రమంలో శుక్రవారం కుటుంబ సభ్యులు కూలీ పనులకు వెళ్లాక ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు మమత విగతజీవిగా కనిపించడం చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి నాగేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కొండాపూర్‌లో యువకుడు..



మనోజ్ (ఫైల్)

దండేపల్లి: అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప మనోజ్ (31) ఏడాది క్రితం వరికోత యంత్రం కొనుగోలు చేశాడు. అది తరచూ మరమ్మతులకు గురికావడంతో దానిని అమ్మేశాడు. మళ్లీ సుమారు రూ.4లక్షల వరకు అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దానికీ తరచూ రిపేర్లు రావడంతో సరిగా నడవలేదు. దీంతో ట్రాక్టర్ కొనుగోలు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో వారితో చెబుతూ బాధపడేవాడు. ఈ విషయంలో భార్య శిరీష అతనికి నచ్చజెప్పి బాధపడవద్దని చెప్పేది. అయినప్పటికీ మనస్తాపంతో మనోజ్ గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయాన్ని తమ బంధువు మల్లేశ్‌కు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే మల్లేశ్ అక్కడికి వెళ్లి మనోజ్‌ను చికిత్స కోసం లక్సెట్టిపేటకు తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు ఒకరి మృతి



నాందేవ్ మృతదేహం

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన ఉర్వత్ నాందేవ్ (55) పాముకాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం నాందేవ్ తన భార్య నిర్మలతో కలిసి గ్రామ శివారులోని తమ పొలానికి వెళ్లాడు. పొలంలో పనులు చేస్తుండగా నాందేవ్‌ను పాము కాటు వేసింది. అతడి భార్య గమనించి వెంటనే నాందేవ్‌ను సిర్పూర్(టి)లోని సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు కార్తిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.